క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో హనుమాన్ వ్రత ఉత్సవం



వెల్దుర్తి వీధుల్లో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి హైవేపై వెలసిన అభయ అంజనేయస్వామి విగ్రహం వద్ద మంగళవారం గురుస్వామి రామాంజినేయులు ఆధ్వర్యంలో హనుమాన్ వ్రత ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం గణపతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకం, నవగ్రహ హోమం, సీతారాముల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అన్నమయ్య సేవా ట్రస్టు కో–ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి బృందంతో శ్రీ హనుమాన్ చాలీసా 27 సార్లు పారాయణం చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి పట్టణ వీధుల గుండా హనుమాన్ చాలీసా పటిస్తూ భక్తులు ఊరేగింపు చేపట్టారు.

నాటుసారా స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

ఆలూరు రూరల్: నాటుసారా విక్రయించేందుకు ఆలూరుకు వస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ దిలీప్ కుమార్ వెల్లడించారు. హొళగుంద మండలం నెరణికి తండాకు చెందిన విజయ్ నాయక్ సారా విక్రయించేందుకు స్కూటర్‌పై వస్తుండగా మంగళవారం ఆలూరు సమీపంలో పట్టుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని స్కూటర్ సీజ్ చేశామని చెప్పారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

ఉపాధి కూలీ మృతి



సత్యనారాయణ (ఫైల్)

దేవనకొండ: మండలంలోని కుంకనూరు గ్రామానికి చెందిన కుక్కల సత్యనారాయణ(60) ఈనెల 16వ తేదీ ఉపాధి హామీ పనులు చేస్తూ అస్వస్థతకు గురయ్యాడు. తోటి కూలీలు వెంటనే ప్రాథమిక చికిత్స కోసం దేవనకొండ ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



అవగాహన సదస్సులో సీఐ వెంకట చలపతి

ఆలూరు రూరల్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆలూరు సీఐ వెంకట చలపతి సూచించారు. మంగళవారం మండలంలోని మొలగవల్లి గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ నంబర్ల నుంచి వచ్చే ఓటీపీలను ఎవరికి చెప్పవద్దన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే రాజకీయ పోస్టులు పెట్టరాదని హెచ్చరించారు. గ్రామంలో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాహనాలకు రికార్డులు తప్పనిసరి

హొళగుంద: వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్‌తో పాటు వాహన రికార్డులను కలిగి ఉండాలని హొళగుంద ఎస్ఐ బాలనరసింహులు అన్నారు. మంగళవారం రాత్రి ట్రైనీ ఎస్ఐ మహమ్మద్, సిబ్బందితో కలిసి ఎల్లార్తి రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. సరైన రికార్డులు లేని వారికి జరిమానా విధించారు.

కార్పొరేషన్ల డైరెక్టర్లకు సన్మానం



కురుబ, వాల్మీకి కార్పొరేషన్ల డైరెక్టర్లను సన్మానిస్తున్న నాయకులు

ఆలూరు: స్థానిక వాసవీ కల్యాణ మండపంలో ఇటీవల రాష్ట్ర కురుబ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమితులైన ఉదయ్‌కుమార్, మంజునాథ్‌ను మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తెర్నెకల్ వెంకప్ప, రంజిత్, వైకుంఠం శివప్రసాదు, కురుబ జయరాములు, హాలహర్వి జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప, మాజీ ఎంపీపీ బసప్ప పాల్గొన్నారు.

ఆశలన్నీ పొగాకు పైనే..!

- రైతులను నిరాశపరిచిన ఖరీఫ్ సీజన్
- శనగ, పచ్చిమిర్చిపైరును తొలగించిన అన్నదాతలు
- ఆదుకుంటున్న పొగాకు సాగు
- దిగుబడులు తగ్గినా ఆశాజనకంగా ధర



టి.గోకులపాడు సమీపంలో సాగు చేసిన పొగాకు పంట



ఎస్‌హెచ్ ఎర్రగుడి వద్ద పొగాకును ఎండబెట్టిన దృశ్యం

కృష్ణగిరి: ఖరీఫ్ సీజన్ రైతులను నిరాశపరిచింది. వర్షాభావ పరిస్థితులు అన్నదాతను ముంచేశాయి. కృష్ణగిరి మండలంలో సాధారణ విస్తీర్ణం 24,000 హెక్టార్లు. ఖరీఫ్‌లో 21,000 హెక్టార్లలో వేరుశనగ, ఆముదం, పత్తి, కంది, పొగాకు, వరి, పచ్చిమిర్చి తదితపంటలు సాగు చేశారు. అయితే అత్యధికంగా 12 వేల ఎకరాల్లో వేరశనగ, కంది 7,900 ఎకరాలు, ఆముదం 5100 ఎకరాలు, వరి 2000 ఎకరాలు, పచ్చిమిర్చి 1000 ఎకరాల్లో సాగు అయ్యింది. వర్షాభావ పరిస్థితుల మూలంగా వేరశన, మిర్చి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. పైరును తొలగించేశారు రైతులు. ఆముద, వరి మాత్రం పెట్టుబడిలో సగం మాత్రం వస్తుందని రైతులు చెబుతున్నారు. కేవలం పొగాకు రైతులు మాత్రం గట్టెక్కారు. గత ఏడాది రికార్డు స్థాయిలో పొగాకు ధరలు నమోదయ్యాయి. దీంతో అధిక మొత్తంలో పొగాకు సాగుకు మొగ్గు చుపారు. కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో దాదాపుగా 4 వేల ఎకరాలకు పైగా ఈయేడాది నల్లరేగడి, బోరు, బావుల కింద పంట సాగు చేశారు. పెట్టుబడి ఖర్చులు పెరిగినా రైతులు వెనుకాడకుండా పంట సాగు చేశారు. దీంతో పంట ఏపుగా వచ్చి కొతకు రావడంతో అన్నదాతలు ఆకులను కోసి ఎండబెట్టే పనిలో నిమగ్నమయ్యారు. గతేడాది ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడిరాగా ఈయేడాది గత నెలలో కురిసిన భారీ వర్షాలకు కొంత దెబ్బతిన్నా మరలా తెరుకుంది. వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో వాణిజ్య పంటగా పొగాకు సాగు గత కొన్నేళ్లుగా సాగు చేస్తున్నారు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో పొగాకు సాగు ఊహించని లాభాలను తెచ్చిపెట్టింది. ఈయేడాది నల్లరేగడి నెలల్లో జొన్న, పొద్దుతిరుగుడు, శనగ పంటలను తగ్గించి పొగాకు వైపు మొగ్గుచూపారు.

తక్కువ పెట్టుబడి.. ఎక్కువ ఆధాయం..

పొగాకు సాగు చేయడానికి పెట్టుబడి తక్కువ మాత్రమే అయినా ఈయేడాది కూలీల ధరలు అమాంతంగా పెరగడంతో పెట్టుబడి ఖర్చులు పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. గత కొన్నేళ్లుగా సాగు చేస్తున్న సంప్రదాయ పంటలకు రైతులు స్వస్తి చెప్పి తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుందనే ఆశతో పొగాకు వైపు మొగ్గుచూపుతున్నారు. గతంలో సాగు చేసే జొన్న, శనగ, పొద్దుతిరుగుడు పంటలకు సకాలంలో వర్షం లేకపోతే నష్టపోయిన దాఖాలాలు ఉన్నాయి. దీంతో నాలుగైదేళ్లుగా అక్కడక్కడ సాగు అవుతున్న పొగాకు వర్షాలు లేకపోయినా నష్టం రాకపోవడంతో రైతులు ఈసారి ఆ పంటనే సాగు చేశారు. పొగాకు సాగుకు ఎకరాకు రూ. 65 వేలకు ఖర్చు అవుతుండగా దిగుబడి 10 క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశం ఉంది. పొగాకు కంపెనీలే రైతుల వద్ద క్వింటాం రూ.15 వేలకు కొనుగోలు చేస్తామని చెప్పడంతో లాభాలు వస్తాయనే నమ్మకంతో ఉన్నారు రైతులు.

కూలీలకు పెరిగిన డిమాండ్.

ఈయేడాది విస్తారంగా పొగాకు సాగు కావడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. పంట ఆకులు నాణ్యతగా వచ్చిన వెంటనే వాటిని కూలీలతో తొలగించాలి. కానీ ప్రతేడాది ఒక్కో కూలీకి దినసరిగా రూ.250 ఉండగా ఇప్పుడు ఏకంగా రూ.400 వరకు చేరుకుంది. దీంతో కూలీలు దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఆటో ఖర్చులు అదనంగా భరిస్తూ కూలీలలను తెచ్చుకుంటున్నారు. దీంతో ఈయేడాది అదనంగా కూలీల ఖర్చు పెరిగింది. గత నెలలో కురిసిన వర్షాలకు కొంత పంట దెబ్బతిన్నందున దిగుబడి కొంత మేర తగ్గవచ్చని రైతులు చెబుతున్నారు.

మూడు ఎకరాల్లో సాగు చేశా



మూడు ఎకరాల పొలంలో పొగాకు పంటను సాగుచేశా. గతేడాది ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఈయేడాది వర్షాభావ పరిస్థితుల మూలంగా 8 క్వింటాళ్ల వరకు వస్తుందనుకుంటున్నా. గతేడాది ధర బాగున్నందున ఎకరాకు రూ. 1.5 లక్షల ఆదాయం వచ్చింది. ఈయేడాది దిగుబడి తగ్గినా ధర మాత్రం రూ.15 నుంచి రూ.18వేల దాకా ఉండటంతో లాభాలు వస్తాయనే నమ్మకంతో ఉన్నాం.

–ఎర్ర సుంకన్న, రైతు, ఎస్‌హెచ్‌ఎర్రగుడి

ఖర్చులు పెరిగాయి



ఈయేడాది ఏడెకరాల్లో పొగాకు పంట సాగు చేశా. పొగాకు పంటకు పెట్టుబడి తక్కువే. నారు నాటిన నుంచి ఎద్దులతోనే వ్యవసాయం చేస్తాం. ఒక్కసారి కలుపు తీస్తే సరిపోతుంది. అయితే ఈయేడాది వర్షాలకు చీడపీడలు ఆశించడంతో మందులు పిచికారీ చేశాం. ఆకులు నాణ్యతగా వచ్చిన తరువాత తీసేందుకు కూలీల అవసరం. ఈయేడాది కూలీల ఖర్చు రెండింతలయ్యింది. మిగతా పంటల కంటే పెట్టుబడి తక్కువగా ఉండటంతో ఈ పంట సాగు చేశాం. దిగుబడి గతేడాది కంటే తగ్గడంతోపాటు ఖర్చులు పెరగడంతో ఆదాయం అంతంత మాత్రంగానే ఉంటుంది.

–కురువ శ్రీనివాసులు, రైతు, ఎస్‌హెచ్‌ఎర్రగుడి

మహిళలు స్వశక్తితో ఎదగాలి



కుట్టు శిక్షణ పొందిన మహిళలతో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, అధికారులు

వెల్దుర్తి(కృష్ణగిరి): మహిళలు చేతి వృత్తులు నేర్చుకుని స్వశక్తితో ఎదగాలని రెడ్ క్రాస్ సోసైటీ జిల్లా కోశాధికారి డాక్టర్ రఘునాథ్‌రెడ్డి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెడ్ క్రాస్ సోసైటీ ఆధ్వర్యంలో ఏడాదిగా కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలల అధినేత కేవీ సుబ్బారెడ్డి, రెడ్ క్రాస్ మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, మండల రెడ్ క్రాస్ అధ్యక్షుడు కేపీ ఆచారి చేతుల మీదుగా ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు పడుతున్న ఇబ్బందులు గుర్తించి వెల్దుర్తి మండలంలో రెడ్‌క్రాస్ భవనంలో మహిళలకు ఏడాది కాలంగా ఉచితంగా కుట్టు శిక్షణ ఇప్పించామని తెలిపారు. కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి కల్పించుకుని కుటుంబానికి అండగా నిలువాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు పరమేష్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హింసకు వ్యతిరేకంగా నిలువడం బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మోహన్‌కుమార్

కృష్ణగిరి: హింసకు వ్యతిరేకంగా కలిసికట్టుగా ప్రజలే నిలబడాలని, మహిళలపై వేధింపులు అరికట్టేందుకు పోరాడడం మన బాధ్యత అని ఎంపీడీఓ మోహన్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన వెలుగు, రెవెన్యూ, పోలీస్ అధికారులతో కలిసి జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారం కార్యక్రమంపై తహసీల్దార్ చంద్రశేఖర్‌తో కలిసి ఎంపీడీఓ సమీక్ష నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మహిళల హక్కులను కాపాడకుండా హింసలేని సమాజాన్ని నిర్మించలేమన్నారు. డిసెంబర్ 23 వరకు గ్రామస్థాయిలో అన్ని శాఖలు సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మహేశ్వరయ్య, ఏఎస్ఐ నాయక్, ఈఓఆర్డీ చిన్న లచ్చప్ప, ఏపీఓ నాగసులోచన, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫాస్ట్ ఫుడ్ వద్దు.. పౌష్టికాహారమే ముద్దు



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఆరోగ్యభారతి కృష్ణవేణి

దేవనకొండ: ఫాస్ట్ ఫుడ్ వద్దు–పౌష్టికాహారమే ముద్దు అని జిల్లా ఆరోగ్యభారతి కృష్ణవేణి అన్నారు. మంగళవారం దేవనకొండలో ఆరోగ్యభారతి సమావేశాన్ని ఎఫ్ఆర్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఫాస్ట్ ఫుడ్ ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల బాలబాలికలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతారన్నారు. ఎదుగుతున్న పిల్లల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. ఇంట్లో తయారు చేసుకునే వాటినే భుజించాలన్నారు. బయట తయారు చేసే వాటిని తీసుకోరాదన్నారు. ప్రకృతిపరంగా లభించే ఆహార పదార్థాలు, కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు ఉత్తమం అని సూచించారు. హెచ్ఎం ఉచ్చీరప్ప, కరస్పాండెంట్ రఘునాథ్ పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

మద్దికెర : చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రభుత్వ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి సూచించారు. రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ చిన్నారుల్లో ఏ మాత్రం అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా పాల్గొన్నారు.

బకాయిల వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

ఆలూరు: స్థానిక కేడీసీసీ బ్యాంకు ద్వారా దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతుల నుంచి రూ.75 కోట్ల బకాయిలు వసూలు చేయాల్సి ఉందని బ్యాంకు మేనేజర్ రవిప్రకాష్ అన్నారు. మంగళవారం బ్యాంకు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 320 మంది రైతుల నుంచి 2024 మే వరకు ఉన్న మొండి బకాయిలను వసూలు వేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

పత్తికొండ(తుగ్గలి) : గుట్టుసాగిస్తున్న వ్యభిచార గృహంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. పట్టణంలోని గుత్తి రోడ్డులో ఓ ఇంటిలో ఇతర ప్రాంతాల నుంచి మహిళలను పిలిపించి కొంత కాలంగా గుట్టుగా వ్యభిచారం చేయిస్తున్నారన్న సమాచారం మేరకు అర్బన్ సీఐ జయన్న ఆధ్వర్యంలో ఎస్ఐ గోపాల్, సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిర్వాహకురాలితో పాటు ఐదుగురు విటులను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు కోర్టులో హాజరు పర్చనున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మిద్దె రంగయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుహాసినమ్మ తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో రావాలని, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తప్పక హాజరుకావాలని ఆమె కోరారు.

స్కూల్ ఎదుట ఎమ్మెల్యే ఫ్లెక్సీ!

- ఈఓకు ఫిర్యాదు చేసిన సామాన్యుడు
- నోటీసులు జారీ చేయడంతో ఈఓతో ఓ వర్గం తెలుగు తమ్ముళ్లు
- మాకే నోటీసులు ఇస్తావా అంటూ బెదిరింపులు



పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన వివాదాస్పద ఫ్లెక్సీ

మద్దికెర : మండల కేంద్రంలో సోమవారం ఓ వర్గం టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదానికి దారితీసింది. టీడీపీ ఎమ్మెల్యే శ్యాంబాబుతోపాటు నాయకుల ఫొటోలతో క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ తమ్ముళ్లు ప్రధాన బస్టాండ్ వద్ద కేవీఆర్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ముందు భాగంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అయితే ఈ ఫ్లెక్సీ ప్రమాదరకరంగా ఉందని ఓ సామాన్యుడు అభ్యంతరం వ్యక్తం చేస్తూ పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఫ్లెక్సీని చూస్తూ విద్యార్థులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని ఫిర్యాదులో పేర్కొనగా స్పందించిన ఈఓ శివ కుమార్ నోటీసులు జారీ చేశారు. దీంతో ఆగ్రహించిన ఓ వర్గం టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం సాయంత్రం పంచాయతీ కార్యాలయం చేరుకుని ఈఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారపార్టీ ఎమ్మెల్యే ఫొటోతో ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తే తమకు నోటీసులు జారీ చేస్తావా... నీకెంత ధైర్యం అంటూ ఈఓను నిలదీశారు. ఫిర్యాదు వచ్చినందునే నోటీసులు జారీ చేశానని ఈఓ ఎంత నచ్చజెప్పినా తమ్ముళ్లు పట్టించుకోలేదు. ఇక్కడ పని చేయాలని లేదా... నీ అంతు చూస్తాం అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. టీడీపీ నాయకులు, కార్యకర్తల తీరును స్థానికులు సైతం తప్పుపడుతున్నారు. ఏఈ ఏమి తప్పు చేశాడని... అంతలా విరుచుకపడలా అంటూ టీడీపీ నాయకుల తీరును తప్పుపడుతున్నారు. ఈ విషయంపై ఈఓ సంప్రదించగా ఓ వ్యక్తి అభ్యంతరం వ్యక్తం చేసినందునే నోటీసులిచ్చామన్నారు. అధికారుల విధులకు ఆటంకం కలిగించడం గ్రామాభివృద్ధికి మంచిది కాదన్నారు.

సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం



మండల మీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ

పత్తికొండ(తుగ్గలి) : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ నారాయణదాసు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో బ్రిడ్జి పూర్తి చేయడంతో పాటు, పంట కాల్వలు పూర్తిచేసి ఎడమ కాల్వకు పందికోన రిజర్వాయర్ నుంచి నీటిని వదలాలని దూదేకొండ ఎంపీటీసీ సభ్యుడు పెద్ద ఈరన్న కోరారు. గ్రామంలోని ఆలయం సమీపంలో సాగుతున్న మద్యం అక్రమ అమ్మకాలను నిరోధించాలని దేవనబండ సర్పంచ్ ప్రవీణ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా గ్రామంలో పిల్లా పాపలతో కూలీలు వలసలు వెళుతున్నారని విద్యార్థుల చదువుల దృష్ట్యా సీజనల్ ఏర్పాటు చేసేలా చూడాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే పోలీసులకు చెప్పి మద్యం అక్రమ అమ్మకాలు జరగకుండా చూస్తామని చెప్పారు. వ్యవసాయానికి తెల్లవారుజామున విద్యుత్ ఇస్తున్నారని, పగటి పూట ఇవ్వాలని చిన్నహుల్తి సర్పంచ్ కేశవరెడ్డి అధికారులను కోరారు. సమీకృత హాస్టల్‌లో సిబ్బంది కొరత ఉందని, బాలికల వసతి గృహంలో నెల కొన్న సమస్యలను వార్డన్లు నాగరాజు, దీపికాబాయి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అపార్ కార్యక్రమంలో భాగంగా జనన ధ్రువీకరణ పత్రాల జారీలో పంచాయతీ కార్యదర్శులందరం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని దూదేకొండ పంచాయతీ కార్యదర్శి బొఖారియా వాపోయారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి సూర్యనారాయణ, ఎంపీడీఓ సువర్ణలత, వైస్ ఎంపీపీలు బలరాముడు, రంగమ్మ, కో ఆప్షన్ సభ్యుడు నజీర్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న న్యాయవాదులు



తహసీల్దార్ కార్యాలయంలో..



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



ఆలూరు: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



పత్తికొండలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

పత్తికొండ(తుగ్గలి) : దేశంలోని ప్రతి పౌరుడు తలెత్తుకుని గౌరవంగా జీవిస్తున్నారంటే అంబేడ్కర్ ఇచ్చిన రాజ్యాంగం పుణ్యమే అని ఎంపీపీ నారాయణదాసు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కారం నాగరాజు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిచారు. సర్పంచ్ శ్రీరాములు, అటికెలగుండు ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గణపతి, జూటూరు శ్రీనివాసులు, లక్ష్మీనాయక్, పీరా పాల్గొన్నారు.

రాజ్యాంగం ద్వారానే సమాన హక్కులు

భారత రాజ్యాంగం ద్వారానే దేశ ప్రజలకు సమాన హక్కులు లభించాయని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేష్, న్యాయవాదులు లక్ష్మన్న, రమేష్‌బాబు, దామోదరాచారి, బాలబాషా, మధుబాబు అన్నారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తామని ప్రతిజ్ఞ చేశారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రవికుమార్, కోశాధికారి రాజశేఖర్, న్యాయవాదులు ప్రసాద్‌బాబు, జటంగిరాజు, వలి, పంపాపతి పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శం

వెల్దుర్తి(కృష్ణగిరి): భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శమని తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కేవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. అలాగే ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు వెల్దుర్తి పాత బస్టాండ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ దాదిపోగు నవీన్ మాదిగ, నాయకులు టైలర్ కృష్ణ, రాజేష్, బజారిచ చిన్న చిన్నయ్య పాల్గొన్నారు.

దేశ ప్రగతి కోసం రాజ్యాంగం



ఆస్పరి: జాతీయ నాయకుల చిత్ర పటాలకు నివాళులు



హొళగుంద: ఎల్లార్తి జెడ్పీ హైస్కూల్‌లో..

కృష్ణగిరి: భారత రాజ్యాంగం ఎనలేని సంపదతో సమానమని తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ మోహన్‌కుమార్ పార్కొన్నారు. స్థానిక సచివాలయంలో మంగళవారం రాజ్యాంగాన్ని గౌరవిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈఓఆర్డీ చిన్న లచ్చప్ప, ఏపీఎం మహేశ్వరయ్య, కస్తూర్బా ప్రిన్సిపాల్ చైతన్యస్రవంతి, పాల్గొన్నారు.

స్వేచ్ఛ, సమానత్వానికి పునాది రాజ్యాంగం

ఆలూరు రూరల్: స్వేచ్ఛ, సమానత్వానికి రాజ్యాంగం పునాది అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మాధవి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగానికి ఎంతో విశిష్టత ఉందన్నారు. హక్కులు, సామాజిక, ఆర్థిక, భేదాలకు వివక్ష లేకుండా ప్రజలంతా కలిసిమెలిసి ఉండేందుకు రాజ్యాంగానిది కీలక పాత్ర అన్నారు. అనంతరం విద్యార్థులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు మద్దప్ప, సుశీల, లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

- ఆస్పరి: స్థానిక మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయాలల్లో ఎంపీడీఓ గీతావాణి, తహసీల్దార్ శివశంకర్‌నాయక్, జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు తదితరులు మహాత్మాగాంధీ, అంబేడ్కర్, రాజేంద్రప్రసాద్ చిత్రపటాలకు నివాళులర్పించారు.
- ఆలూరు: స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో ఆలూరు, పత్తికొండ డివిజన్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గూళ్యం ఎల్లప్ప, చిప్పగిరి లక్ష్మీనారాయణ తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే అరికెర గురుకుల అంబేడ్కర్ పాఠశాల, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరిగాయి.
- హొళగుంద: ఎల్లార్తి సచివాలయం, జెడ్పీ ఉన్నత పాఠశాల, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో నాయకులు, టీచర్లు, అధికారులు, గ్రామపెద్దలు అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు.
- దేవనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మద్దిలేటి ఆధ్వర్యంలో అంబేడ్కర్, మహాత్మాగాంధీ, బాబు రాజేంద్రప్రసాద్, సర్దార్ వల్లభాయ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
- హాలహర్వి: ఎంపీడీఓ వరలక్ష్మి, తహసీల్దార్ నజ్మాభాను ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరిగాయి.



దేవనకొండ: మాట్లాడుతున్న హెచ్ఎం మద్దిలేటి



హాలహర్వి: మాట్లాడుతున్న ఎంపీడీఓ వరలక్ష్మి